

ఓం నమో భగవతే శ్రీ రమణయ

# రమణ భాస్కర



సంపుటి : 8 సంచిక : 21 పుష్పం : 52-53 20-7-2003

**RAMANA BHASKARA**
TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE

PAGES : 16

VOL : 8 ISSUE : 21

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

PUBLISHER
**P.S. RAMARAJU**
LAKSHMI
MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 224589, 224689

PRINTER
**SHRIRAM GRAPHICS**
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 222438, 221260
94401-31188

## బ్రాంతులు ఉడిగితేనే - బ్రహ్మం వ్యక్తమవుతుంది

బట్టబైయిట ఉన్న బ్రహ్మం బైయిట పడాలంటే బ్రాంతుల వలయాల నుంచి మనం బయట పడితీరాలి. ఒక ఒరలో రెండు కత్తులు ఇమడవు. మనస్సుతో తెలియబడేవి అన్ని బ్రాంతులే, వాటిని అధిగమించాలంటే వివేకంతో కూడిన వైరాగ్యాన్ని అభ్యాసంగా పెట్టుకోవాలి. ఇంద్రియాల ద్వారా మన దృష్టి బయటికి తరలించబడినప్పుడు కొన్ని ఆకారాలు - కొన్ని అనుభవాలు మనస్సులో ముద్రలుగా పడతాయి. వాటితో మన దృష్టి అంతా ప్రపంచం వైపుకు నిమగ్నమౌతుంది. అవి అన్ని అశాశ్వతమైనవి. అవి మనకు శాశ్వత సుఖాన్నిస్తాయని బ్రాంతికి గురిఔతాము. ప్రతీ అనుబంధంలో, ప్రతీ సంయోగంలోనూ వియోగం ఉంటుంది. ఒక్క ఆత్మలోనే వియోగం ఉండదు. మనం ఎన్ని గుణపాఠాలు నేర్చుకొన్నా బ్రాంతుల నుండి విడుదల పొందలేము. దానికి ఒక్కటే మందు, మాయాధిపతి (సద్గురు) పాదాలను ఆశ్రయించటమే. "అంతర్ముఖంగా వెళ్లి అంతిమ రహస్యం తెలుసుకోవాలంటే బ్రాంతుల లేమితనాన్ని గుర్తించాలి. పంచభూత నిర్మితమైన ఈ సృష్టి అంతా మనలోని వాసనల వల్లనే తన ఉనికిని నిలబెట్టుకొంటున్నాయి. వాసనాక్షయమైతే ఈ అద్భుత సృష్టితో మనకు పనిలేదు, పంజరం నుండి బైటపడ్డ పక్షివలే మనం బ్రాంతుల నుండి విడువడి బ్రహ్మానందంలో స్వేచ్ఛగా ఉంటాము అని పెద్దలు చెబుతున్నారు. మన పుట్టకతో వచ్చే శరీరం మన కూడా రాదు. అటువంటప్పుడు ఈ ప్రాపంచిక విషయాలల్లో నిజం ఉందని ఎలా నమ్మాలి. ఈ భోగభాగ్యాలు - ఈ అందచందాలు శాశ్వతం కాదు అని ప్రత్యక్షంగా చూస్తున్నాము. ప్రతీక్షణం మనం మరణం దిశగా వెళుతున్నాము. బ్రాంతులకు లోనైన వాళ్ళు అవసానదశలో పడే బాధను గుర్తుంచుకోవాలి. శ్రీ నాన్నగారుఅంటారు ఒక్కరాత్రి కరెంటు లేకపోతే ఉండలేకపోతున్నాము. మరణానంతరం వేలాది సంవత్సరాలు కటికచీకట్లో ఉండవలసి వస్తుందన్న సంగతి తెలియటం లేదు, అసలు జననమరణాల్లో దాగిఉన్న దుఃఖం తెలియటంలేదు అన్నారు. మనం ఈ మాయాప్రపంచం మీదనే మన ఆశలన్నీ లగ్నం చేసుకొంటే మనం - మనంగా ఉండలేము. బ్రహ్మంగా ఉండలేకపోతే అన్నీ బంగపాట్లే, భయాలే. ఒక ప్రక్క ప్రకృతి - మరొకప్రక్క బ్రహ్మం ఉంది. మన బుద్ధి శాశ్వత సుఖప్రదమైన బ్రహ్మాన్ని అంటిపెట్టుకోవాలి, అదే జీవితలక్ష్యం.

సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం

ఈ సంచికలో......

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగహ్రాభాషణములు**

30-6-2003 ధర్భరేవు ........ 3
13-7-2003 జిన్నూరు ........ 10

Visit us @ www.srinannagaru.com

To
Nannagaru,
Jinnuru.

Generally speaking I have very private nature but with you there is nothing like that - I just want to open up my heart and life to you. I have every trust and confidence in you as *Satguru* and in your spiritual impeccability - you are in no way different to my own Self. I feel a great sense of gratitude that it is one such as you that is my Guru.

- Anna Losardi
(England)

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-6-2003, దర్భరేవు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మానవుడిలో మంచీఉంటుంది, చెడూఉంటుంది. మంచిని పెంచుకొంటూ రావాలి, చెడును తగ్గించుకొంటూ రావాలి. ఈ ఆధ్యాత్మిక సాధనల యొక్క ప్రయోజనం అదే. జపము, ధ్యానము, విచారణవలన మీకు శారీరకఆరోగ్యం బాగుపడుతుంది, మానసిక ఆరోగ్యం బాగుపడుతుంది. మనం భౌతికంగా కాని, ఆధ్యాత్మికంగా కాని ఏది సాధించాలన్నా ఆరోగ్యం ముఖ్యం. మనం శారీరకఆరోగ్యానికి యిస్తున్న విలువ మానసికఆరోగ్యానికి ఇవ్వటంలేదు. మేము భౌతికంగా చాలా బాగున్నాము. ఎటుచూసినా మాకు ఏమీ లోటులేదు. కాని అశాంతిగా ఉన్నాము అని కొంతమంది అంటూఉంటారు. ఈ మాటలు ధనవంతులు, విద్యావంతులు కూడా అంటూ ఉంటారు. అశాంతి తగ్గటానికి ఆధ్యాత్మికచింతన ప్రతీవారికి అవసరం. జీవితంలో ఏదైనా కష్టదశ వచ్చినప్పడు ఆధ్యాత్మికచింతన మీకు బాగాఉపయోగపడుతుంది. భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు కాని మనకు చిత్తశుద్ధి లేకపోవటంవలన, పవిత్రత లేకపోవటం వలన ఆయన మనకు తెలియటం లేదు. మనకు పవిత్రత కలిగినప్పడు మనలోపల ఉన్న ప్రకాశం మనకు తెలుస్తుంది. దీనికి అభ్యాసం, వైరాగ్యం ఉండాలి. జీవితం పొడుగునా, నీ ముక్కులో గాలి తిరుగుతున్నంత వరకు అభ్యాసం వైరాగ్యం విడిచిపెట్టవద్దు. వాటిని కాపాడుకో అని భగవంతుడు చెప్పాడు. మనకు ఎంతో కొంత వైరాగ్యం లేకపోతే మనం ఎంత ప్రయత్నం చేసినా మనస్సు లోపలకు వెళ్ళదు. మనస్సుకు లోచూపు కలిగితేనేకాని లోపలఉన్న వస్తువు మనకు గోచరం కాదు. అందుచేత వైరాగ్యం అవసరం. మీకు వైరాగ్యం ఉంటే సరే, లేకపోతే ప్రాక్టీసుచేయమని చెప్పారు. ఏసబ్జక్టు మనం నేర్చుకోవాలన్నా ముందు శ్రద్ధ ఉండాలి. ఆధ్యాత్మికజీవితంలో ముందు మనకు తెలుసుకోవాలనే కాంక్ష రావాలి, బ్రహ్మజిజ్ఞాస ఉండాలి. బ్రహ్మజిజ్ఞాస కలగటానికే మనం సత్కర్మలు చేయాలి, సత్పురుషులతో సహవాసం చేయాలి. మనకు ఇంద్రియాలు తెలుస్తున్నాయి, శరీరం తెలుస్తోంది. మన ఇంద్రియాలను, శరీరాన్ని మన అహంకారం ఉపయోగించుకొంటూఉంటే దానిని మనం ఎలా పోగొట్టుకోగలము. మనం ఏదైనా మాట మాట్లాడితే, ఏదైనా పనిచేస్తే అహంకారంకోసం చేస్తున్నాము. ముందు నన్ను నేను కరెక్టు చేసుకోవాలి. నన్ను నేను కరెక్టు చేసుకున్నాక ఇతరులను కరెక్టు చేయటానికి ప్రయత్నం చేయాలి. నేనే అహంకారంతో కాలిపోతూ ఉంటే మిమ్మల్ని అహంకార రహితస్థితికి నేను ఎలా తీసుకొని వెళ్ళగలను. మనం ఏదైనా మాట్లాడుతూ ఉంటే అది ఇతరులకు జ్ఞానోదయం కలగటానికి మాట్లాడుతున్నామా లేకపోతే మనం అహంకారం కోసం మాట్లాడుతున్నామా అది లోపల మనకు తెలుస్తూ ఉంటుంది. మనం అహంకారాన్ని ప్రమాణంగా తీసుకోకూడదు, భగవంతుడు చెప్పిన వాక్యాన్ని ప్రయాణంగా తీసుకొని జీవించాలి. నేను ఆపనిచేసాను ఈపనిచేసాను అని అనుకోవటం వలన దుఃఖంవస్తుంది. తానుకర్తను అనుకొన్నంతకాలం, ఈదేహాన్ని, మనస్సును ఆత్మ అనుకొన్నంతకాలం దుఃఖం నిన్ను వెంటాడుతుంది. మానవుడు తాను కర్తకాడు, కర్తఈశ్వరుడే. చిన్న పిల్లలను చూడండి, ఎన్నోసార్లు పడిపోతేనేగాని వారికి నడకరాదు. అలాగే మనం ఫెయిల్ అవ్వటానికి కూడా సిద్ధంగా ఉండాలి, తరువాత పాస్అవ్వటం నేర్చుకొంటాము. మన హృదయంలో ఉన్న శాంతి, సుఖం మనకు స్వరూపంగా అనుభవం అయ్యేవరకు ఈజన్మలు ఆగవు, జన్మపరంపరలలో తిరుగుతూ ఉండవలసిందే, మాయనిన్ను విడిచిపెట్టదు, ప్రకృతి నిన్ను విడిచిపెట్టదు. ఈశ్వరుడి పాదాలయందు మనకు భక్తి లేకపోతే, ఈశ్వరుడియందు మనకు విశ్వాసం లేకపోతే ఆయన చేతిలో ఉన్న మాయ మనకు దారి ఇవ్వదు. గజేంద్ర మోక్షం కథమనకు భాగవతంలో వస్తుంది. గజేంద్రుడు అడవిలో ఉన్న జంతువులకు పెద్దరాజు, ఆ ఏనుగుకు దాహం వేసింది. నీరు తాగటానికి, శరీరాన్ని తడుపుకోవడానికి అడవిలో ఉన్న పెద్ద కొలనులోనికి దిగింది. మిగతా ఏనుగులు దిగినాయి. నీరు తాగుతున్నాయి, స్నానాలు చేస్తున్నాయి. ఎంత చల్లగా ఉంది, ఎంత బాగుంది ఈజీవితం అని అనుకొంటోంది ఆరాజు. సడన్‌గా ఒక మొసలివచ్చి ఆ ఏనుగును పట్టుకొంది. ఒక్క క్షణంలో ఆ ఏనుగు యొక్క సుఖం, శాంతి అంతాకూడా దుఃఖంగా, అశాంతిగా మారిపోయింది. మన జీవితాలుకూడా అంతే. ఏనుగు చాలా బలమైన జంతువు. ఆమొసలినుండి విడిపించుకోవటానికి ప్రయత్నం చేసింది, మిగతా ఏనుగులు కూడా సహాయం చేసాయి కాని ప్రయోజనం ఏమీలేదు. ఆపోరాటం చాలాకాలం జరిగింది. ఒకోసారి ఏనుగుబలం పుంజుకొంటోంది, ఒకోసారి మొసలి బలం పుంజుకొంటోంది. అలాగే మన జీవితంలో కూడా మీరు పుణ్యకర్మలు చేసినప్పడు అభివృద్ధిలోనికి వచ్చేసాము అనిపిస్తుంది, కాని పాపకర్మలు చేసినప్పడు వెనక్కివెళ్ళిపోతున్నాము అనిపిస్తుంది. ఏనుగుబలంపుంజుకొన్నా, మొసలిబలంపుంజుకొన్నా ఆపోరాటం అంతా ఎక్కడ జరుగుతోంది, కొలనులో జరుగుతోంది. అలాగే మానవుడు తాను అభివృద్ధిలోనికి వచ్చాను అనుకొన్నా, తానుపాడైపోయాను అనుకొన్నా ఇది అంతా

అజ్ఞానములో జరుగుతోంది. బాహ్యంగా మీకు ఏదైనా పురోగతి రావచ్చు అదీ అజ్ఞానమే, ఏదైనా తిరోగతి రావచ్చు అదీ అజ్ఞానమే. నీకు ఆత్మజ్ఞానం లేనప్పుడు నీకు పురోగతి కలిగినా, తిరోగతి కలిగినా నీవు అజ్ఞానంలో ఉన్నట్లే, అదిమర్చిపోకు అంటాడు వ్యాసుడు. మొదట ఏనుగు తనబలం మీద ఆధారపడింది. మనం కూడా అంతే. అంతా బాగున్నప్పుడు తెలుసున్నవాళ్లను కూడా మీరు ఎవరు అని అడుగుతాము. రామకృష్ణపరమహంస గారి జీవితంలో ఒక సంఘటన వస్తుంది. ఒకడు రామకృష్ణపరమహంస దగ్గరకు రోజూ వచ్చి, ఆయనకు నమస్కరించి, ఆయనను ఎంతో గౌరవంగా చూసేవాడు. వాడికి సడన్‌గా ఏదో ఆస్తికలిసింది. అప్పటినుండి పరమహంస దగ్గరకు రావటం మానేసాడు. ఒకసారి పరమహంస గారు, బ్రహ్మానంద కలిసి నదిని దాటుతూ ఉంటే అదే పడవలో ఆ ఆస్తి కలిసిన వాడు కూడా ఉన్నాడు. అప్పుడు వాడు రామకృష్ణపరమహంస గారితో ఏమయ్యా పంతులు బాగున్నావా, ఈమధ్యన కనబడటంలేదేమిటి అన్నాడట. ఎంతో సాత్వికబుద్ధి ఉన్న బ్రహ్మానందకు కూడా గురునింద వలన కోపంవచ్చిందట. అప్పుడు పరమహంస గారు బ్రహ్మానంద భుజం తట్టి నీవు ఉద్రేకపడవద్దు, వాడు కాదు మాట్లాడుతూ ఉంట, వాడి డబ్బు మాట్లాడిస్తోంది అందువలన మనం మౌనంగా ఉండటం మంచిది అన్నారట. మనకు ఏదైనా అధికారం ఉన్నా, డబ్బుఉన్నా వాటిని నిగ్రహించుకోలేకపోతే మనం ప్రమాదంలో పడతాము. డబ్బుమనకు కంఫర్టు తీసుకొని వస్తుంది కాని శాంతిని తీసుకొని రాలేదు. కంఫర్టుకంటే కంట్రోలు గొప్పది. నువ్వు సంపాదించిన వెయ్యికోట్ల డబ్బుకంటే కూడా నీమనోనిగ్రహం గొప్పది. నీకు మనోనిగ్రహం లేనప్పుడు నువ్వు వెయ్యికోట్లు సంపాదించినా నీకు శాంతి వచ్చే అవకాశంలేదు. నువ్వు ప్రధానమంత్రివి అయినా, ఎంత గొప్పవాడివి అయినా కూడా నేను కర్తను అనుకొన్నంతకాలం నిన్ను దుఃఖం వెంటాడుతుంది. నేను కర్తను కాదు, ఈశ్వరుడే కర్త అని నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు ఇప్పుడే ఇక్కడే దుఃఖం చల్లారిపోతుంది. ఏనుగు తన శక్తినంతా ఉపయోగించి మొసలితో పోరాడింది కాని నాశక్తి చాలదు, ఇంక నన్ను నేను రక్షించుకోలేను అని గ్రహించింది. అప్పుడు ఈశ్వరుడు జ్ఞాపకంవచ్చాడు, భగవంతుడివైపుకు మొఖం తిరిగింది. కాని వివేకవంతుడు, భక్తుడు తనకు శక్తి ఉన్నప్పుడే ఈశ్వరుని వైపుకు మొఖం త్రిప్పతాడు. మనకు ఉన్నవిఅన్నీ ఊడిపోయిన తరువాత రాముడు జ్ఞాపకం వస్తాడు కాని బుద్ధిమంతులు అయితే అన్నీ ఉండగానే రాముడిని స్మరించుకొంటారు. అప్పుడు గజేంద్రుడు రక్షణకోసం మహావిష్ణువును ప్రార్థిస్తాడు. అప్పడు మహావిష్ణువు వచ్చి మొసలిని సంహరించి గజేంద్రుడిని రక్షిస్తాడు.



ఇక్కడ గ్రహించవలసింది ఏమిటిఅంటే ఆకోలనులో జరిగిన పోరాటం ఎటువంటిదో మనం అజ్ఞానంలో జీవించే జన్మలు కూడా అటువంటివే, జీవించిఉన్నంతకాలం చాలా సుఖంగా జీవించటం, మరణం వచ్చినప్పుడు ఏమీబాధలేకుండా మరణించటం ఇది కొద్దిమందికే జరుగుతుంది. జీవుడు ఈశరీరాన్ని విడిచివెళ్లేటప్పుడు ఎంతో కొంతబాధ ఉంటుంది. కాని అంతకంటే ఎక్కువబాధ ఉంది అది మీరు ఊహించటంలేదు అంటున్నారు భగవాన్. ప్రాణం శరీరాన్ని విడిచివెళ్లేటప్పుడు ఎంతబాధ ఉన్నా అది తక్కువే కాని నాది అనే తలంపు వలన జీవుడికి ఎక్కువబాధ వస్తుంది అంటున్నారు. నీ శరీరం మరణించేటప్పుడు వచ్చే దుఃఖం కంటే, అశాంతి కంటే నాది అనే తలంపులో నుండి ఎక్కువ దుఃఖం వస్తుంది, ఎక్కువ అశాంతివస్తుంది.

మనం నేను, నేను అంటాము. అదికూడా ఒక తలంపే, అది వాస్తవంకాదు. నాది అనేది కూడా ఒక తలంపే, అది వాస్తవం కాదు. మనఇంట్లో ఎవరైనా చనిపోతే ఎవరైనా చూడటానికి వస్తే ఏడ్చేది కూడా నేను అనే తలంపే. ఆ వచ్చినవాడు ఎంత నిజమో ఈ తలంపు కూడా అంతేనిజం. ఈ మధ్య ఒక అమ్మాయి చెపుతోంది. మా అత్తగారు నన్ను గుర్తించటంలేదు, నేను పని చేస్తున్నాను కాని గుర్తింపు లేదు అని చెపుతోంది. నాకు వైరాగ్యం వస్తోంది, కాశీయో, అరుణాచలమో వెళ్ళిపోవాలి అనిపిస్తోంది అని అంది. ఆ అమ్మాయికి నేను ఒకటే చెప్పాను. ఆ గుర్తింపు కోరేది నీ అహంభావన. నీలోపలఉన్న నిజానికి గుర్తింపులు అక్కరలేదు, ఎందుచేతనంటే దానికి ఇతరులు లేరు. ఈ గుర్తింపులు ఎక్కువ అయ్యేకొలది నీకు అహంభావన పెరుగుతుంది, అజ్ఞానం పెరుగుతుంది. నీవు ఏదైతే పోగొట్టుకోవాలి అనుకొంటున్నావో నీకు తెలియకుండా దానిని పెంచుకోవటానికి ప్రయత్నం చేస్తున్నావు. నీ అత్తగారు నిన్ను గుర్తించదు అనుకో అది నీ సాధనలో ఒక భాగంగా తీసుకో. ఆ అమ్మాయికి నేను ఒక మాట చెప్పాను, ఆ మాట అంటే నాకు ఇష్టం, అదే మీకు చెపుతున్నాను. మనం కూడా జీవితంలో అనామకంగా చనిపోతే ఈశ్వరుని దయకు మనం పాత్రులవుతాము. మనందరం గొప్పగా చనిపోవాలి, వల్లకాటికి వెయ్యిమంది రావాలి, ఇంట్లో వారందరూ ఏడ్వేయాలి ఎందుకండీ ఈ గొడవలు. నాన్నగారికి ఏదో గౌరవం వచ్చేసింది అని మీరు అనుకొంటున్నారు, ఈ గౌరవం బరువే. దీనివలన ఏదో జ్ఞానం వచ్చేసింది అనుకోవద్దు. అనామకంగా చనిపోవటమే మంచిది అని నాకు అనిపిస్తోంది. గుర్తించకపోవటమే ఆధ్యాత్మికంగా మంచిది అని ఆ అమ్మాయికి చెప్పాను. మనకు మోక్షం ఇచ్చేది భగవంతుడు. లోకం మనకు మోక్షం ఇవ్వదు. ఈ లోకం ఎంతో

గొప్పది అని మనం అనుకొంటున్నాము కాని ఈ లోకం అశాశ్వతము, దుఃఖాలయం అని భగవంతుడు గీతలో చెప్పాడు. నీవు లోపలకువెళితే నీకు సుఖం వస్తుంది గాని ఈ లోకాన్ని అంటిపెట్టుకొని ఉంటే నీకు సుఖం రాదు. స్వర్గము, నరకము గురించి ఒక స్వాముల వారిని అడిగితే నీకు చెడుతలంపులు వస్తూ ఉంటే అదే నరకము, నీకు మంచితలంపులు వస్తున్నాయి అనుకో అదే స్వర్గము. ఈ స్వర్గము, నరకము నీ తలంపుల మీద ఆధారపడి ఉన్నాయి కాని అవి నిజం కాదు, వాటిని నీవే కల్పించుకొంటున్నావు. నన్ను బ్రహ్మం అంటున్నారు అది నీ హృదయంలోనే ఉంది అంటున్నారు కదా అక్కడకు ఎలా చేరుకోవాలి అని స్వాములవారిని అడిగితే నీ హృదయం నగ్నమయితే, నీ హృదయం ఖాళీఅయితే అప్పుడు అక్కడఉన్న వస్తువు నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది, అదే బ్రహ్మం, దాని స్వరూపమే ఆనందం, దాని స్వరూపమే జ్ఞానం, దాని స్వరూపమే శాంతి.

నిన్ను నీవు తెలుసుకో, నిన్ను నీవు తెలుసుకో అని మీరు చెపుతున్నారు అంటే ఎవరిని తెలుసుకోమంటారు అని ఒక ప్లీడర్‌గారు భగవాన్‌ను అడిగారు. నిన్ను నీవు తెలుసుకో అంటే నీవు ఏదిగా ఉన్నావో దానిని తెలుసుకో. అది నువ్వు, అది నువ్వు అని మీరు అంటున్నారు కాని యిది నేను అని అనుకొంటున్నాను అని ప్లీడర్‌గారు అడుగుతున్నారు. యిది నీవైతే అది నీవు అని నేను చెప్పనక్కరలేదు. అంటే ఇది నీవు కాదు అని చెప్పకుండా చెప్పటం. ఇప్పడు దేహమే నీవు అనుకొంటున్నావు. దేహం నీవు కాదు, నీవు ఆత్మవు అని చెపుతున్నారు. అహంకారాన్ని సంతృప్తి పరచుకోవటం తప్ప జీవుడికి ఇంకోపని లేదు, ఇంక జ్ఞానం ఎలా కలుగుతుంది. నీ హృదయంలో ఉన్న సత్యం తప్పించి, బ్రహ్మం తప్పించి మిగిలినదంతా నీ మనస్సు యొక్క కల్పితమే. ఆ కల్పితాన్ని విడిచిపెట్టకుండా కల్పితం కానిది నీకు అనుభవంలోనికి రాదు. ఇప్పడు మనకు వచ్చే వైరాగ్యాలు నిలబడవు, వివేకం వలన వచ్చే వైరాగ్యం మాత్రమే నిలబడుతుంది. ఇది సత్యము ఇది అసత్యము, ఇది నిత్యము ఇది అనిత్యము, ఏది స్థిరంగా ఉండేది. ఏది స్థిరంగా ఉండదు అని వివేకం వలన వచ్చే వైరాగ్యం నిలబడుతుంది కాని ఏదో ఇంట్లో సంఘటనల వలన వచ్చే వైరాగ్యం నిలబడదు. ఇవి అన్నీ ఎప్పడో ఒకప్పడు ఊడిపోతాయి. వైరాగ్యము వివేకంలోనుండి రావాలి. మనం పొందవలసింది ఏమిటి? ఏ వస్తువునయితే మనం పొందుదామనుకొంటున్నామో దానికి అనుగుణంగా మనం జీవిస్తున్నామా లేదా, మన ఆలోచన సరిగా ఉందా లేదా ఇవన్నీ నీవు చూసుకోవాలి. సత్యాన్వేషణలో నీవు ఉన్నప్పడు ఆ వివేకంలోనుండి వచ్చిన వైరాగ్యం నిలబడుతుంది కాని ఏదో కోపం వలన, బాహ్యసంఘటనల వలన వచ్చే వైరాగ్యం నిలబడదు.

యోగి అంటే సమానదృష్టి ఉన్నవాడు యోగి అని గీతలో భగవంతుడు చెప్పాడు. సమానత్వం, సమదృష్టి ఎవరికి వస్తుంది? దేహభావన ఉన్నవాడికి సమానత్వంరాదు. పరమాత్మభావన ఉన్నవాడికి సమానత్వం వస్తుంది. పరమాత్మభావన ఉన్నవాడు అందరిపట్ల సమానంగా ఉండగలడు. ఈ శరీరాలు అన్నీ నీడలు, బొమ్మలు. ఒక బొమ్మ యింకొక బొమ్మతో దెబ్బలాడుతూ ఉంటుంది, తిడుతూ ఉంటుంది. కాని అందరిలో అంతర్యామిగా ఈశ్వరుడు ఉన్నాడు. ఆ ఈశ్వరభావన ఉన్నవాడికి, పరమాత్మభావన ఉన్నవాడికి సమానత్వం వస్తుంది. భగవంతుడికి ఒక రూపం లేదు, గుణం లేదు. మనకోసమే ఆయన రూపాలను కల్పించుకొంటాడు, గుణాలను కల్పించుకొంటాడు. జ్ఞాని గురించి భగవాన్ చెపుతూ వాడికి దయ, సమానత్వము, శాంతి, ఆనందం ఇవిఅన్నీ సహజంగా ఉంటాయి. ఇవి మనకు సహజంగా ఉండవు కాని ప్రాక్టీసుచేస్తే మనకు కూడా వస్తాయి. మహర్షులు, మహాత్ములు ఏస్థితిని అయితే పొందారో అదిమీరుకూడా పొందవచ్చు కాని ఆ జిజ్ఞాస ఉండాలి, తెలుసుకోవాలనే కాంక్ష మనకు ఉండాలి, ఆ తపన ఉండాలి. భగవాన్‌తో ఎవరైనా బాహ్యవిషయాలు మాట్లాడుతూ ఉంటే వారు అలా మాట్లాడుతున్నారు ఏమిటి అని భగవాన్‌ను అడిగితే వారికి ఉన్నది వారు యిస్తున్నారు, మనకు ఉన్నది మనం ఇవ్వవచ్చు కదా అనేవారు భగవాన్. జ్ఞాని అజ్ఞానాన్ని ఇవ్వలేడు. అజ్ఞాని జ్ఞానాన్ని ఇవ్వలేడు. ఒక అజ్ఞాని దగ్గరకు వెళ్ళి కూర్చుంటే అక్కడ శాంతి దొరకదు, జిజ్ఞాస కలుగదు. భగవంతుడిని తెలుసుకోవాలనే కాంక్ష మీకు ఏదైనా కొద్దిగాఉంటే ఆ దీపాన్ని కూడా ఆర్పేసి ఇంటికిపంపుతారు. మనం రాగద్వేషములు ఎంతవరకు తగ్గించుకొంటే అంతవరకు మంచిది. మనం ఎవరిమీద అయినా ద్వేషం పెట్టుకొంటే మన మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది. మన చైతన్యస్థాయిని పెంచుకోవటం కోసం, ఆత్మజ్ఞాన సముపార్జన కోసం మనం ఎవరిమీద అసూయ పెట్టుకోకూడదు, ద్వేషం పెట్టుకోకూడదు. అసూయ వలన, ద్వేషం వలన మన మనస్సు వెళ్ళి వారిమీద వాలుతుంది, అంటే బాహ్యముఖానికి వెళుతుంది గాని అంతర్ముఖం అవ్వదు. నువ్వు నన్ను శరణువేడితే అన్ని పాపాలనుండి, అన్ని దోషాల నుండి విడుదలచేస్తాను, విడుదలచేయుటమే కాదు నీకు మోక్షము ఇస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు. మోక్షం అంటే విడుదల. అజ్ఞానంలో నుండి విడుదలే మోక్షం, బంధంలోనుండి విడుదలే మోక్షం. ఆయన దయకలిగితే ఆ విడుదల కొన్ని క్షణాలలో ఇస్తాడు పరమేశ్వరుడు. ఆ ఏనుగును చూడండి ఏన్నో సంవత్సరాలు పోరాడింది కాని ఒక్క క్షణంలో ఆ మొసలిని సంహరించి ఏనుగును విడిపించాడు. జ్ఞానికి వాడి

హృదయంలో ఉన్న వస్తువు గురించి తెలుసు. సత్యం ఏమిటో జ్ఞానికి తెలుసు కాబట్టి వాడు అన్ని పరిస్థితులలో, అన్ని అవస్థలలో ఒకేలాగ ఉంటాడు. బాహ్యపరిస్థితుల ప్రభావం వాడిమీద ఉండదు, వాడికి శరీరం ఉన్నా లేకపోయినా ఒక్కటే, లోకం కనిపించినా, కనబడకపోయినా ఒక్కటే, వాడు సమానంగా ఉంటాడు. వాడు జ్ఞాని. అరుణాచలం వెళ్ళాలంటే ఇంత, కాశీ వెళ్ళాలంటే ఇంత ధనం ఉండాలి అని ఒక అంచనా వేసుకొని అంత ధనం తీసుకొని వెళ్తాము. అలాగే భగవంతుని దగ్గరకు వెళ్ళటానికి నీ ధనం ఇక్కడ మారినట్లు అక్కడ మారదు, ధర్మాన్ని ఆచరిస్తే ఆ ధర్మం నీ మరణానంతరం కరెన్సీగా మారి భగవంతుని దగ్గరకు వెళ్ళటానికి సహకరిస్తుంది. ఊరు వెళ్తే ఎంత ధనం అవసరమో చూసుకొన్నట్లు భగవంతుడిని చేరుకోవటానికి ఎంత ధర్మాచరణ కావాలి, ఎలా ధర్మబద్ధంగా జీవించాలి అనే అంచనా నీకు వద్దా అని రాజాజీ అంటున్నారు.

జ్ఞాని మనస్సు పరిశుద్ధంగా, నిర్మలంగా ఉంటుంది. జ్ఞాని ప్రపంచంలో ఉంటాడు కాని లోకంలో ఏ ఆకర్షణకు లోనవ్వడు కారణం అది సత్యం కాదు, స్వప్నం అని తెలుస్తూ ఉంటుంది. మనం స్వప్నంలో ఉన్నంతసేపు స్వప్నం నిజం అనుకొంటాము, అలాగే ఈ ప్రపంచంలో ఉన్నంతకాలం ఈ ప్రపంచమే నిజం అనుకొంటాము కాని జ్ఞానికి స్వప్నంలో ఉన్నా అది స్వప్నం అని తెలుస్తూ ఉంటుంది. నీ కోపాలు, తాపాలు, రాగాలు, ద్వేషాలు ఇవి అన్నీ నిజంపైన ఉన్న పొరలు. ఆ పొరలను తెంచుకో అంతేగాని వాటిని పెంచుకోవద్దు. నీవు ఊహించేవన్నీ నిజం పైన తొడుగులు. ఆ తొడుగులు పెంచుకొని బంధంలోపడతావా తగ్గించుకొని మోక్షంలోనికి వెళతావా నువ్వే ఆలోచించుకో. సత్యసాక్షాత్కారానికి మేం చేయవలసిన ప్రయత్నం చేస్తాము. కాని మీ సహాయం మాకు కావాలి అంటున్నాడు. అది ఎప్పుడూ ఉంది, మీ సహాయం కావాలి అని అడగనవసరం లేదు, గురువు వచ్చింది దానికే. సహాయం చేయటం గురువుకు బరువు కాదు, మీరు అడగటమే బరువు. మీరు మాకు సహాయం చేస్తున్నారు అని మాకు ఎలా తెలుస్తుంది అని అడుగుతున్నారు. మీ శరణాగతి నిజమైతే ఇక్కడనుండి అందే సహాయం మీకు తెలుస్తుంది. ప్రకృతి మాటలు వదిలేసి భగవంతుని పాదాలను ఆశ్రయించి నిరంతరం ఆయనను స్మరించటం వలన మనం తరిస్తాము. మోక్షం పొందటానికి యుక్తి పనికిరాదు, ధర్మాచరణ వలన మాత్రమే మోక్షం పొందగలము.

20-7-2003

## సద్గురు శ్రీ నాన్న గారి అనుగ్రహభాషణములు, 13-7-03, జిన్నూరు.

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు గురుపూర్ణిమ. భారతీయులకు ముఖ్యమైన పండుగలలో గురుపూర్ణిమ ఒకటి. వ్యాసుడు యొక్క జన్మదినోత్సవమును గురుపూర్ణిమగా సనాతనకాలంనుండి భారతీయులు జరుపుకొంటున్నారు. మన భారతీయసాహిత్యానికి, తత్వశాస్త్రానికి వ్యాసమహర్షి, వాల్మీకిమహర్షి మూలపురుషులు. ఈ గురుపూర్ణిమ రోజున ఎవరి గురువును వారు సాంప్రదాయపద్ధతిలో ఆరాధించుకొంటూ ఉంటారు. మనకు బాహ్యంగా ఉన్న చీకటిని సూర్యుడు పోగొడుతున్నాడు, లోపలఉన్న చీకటిని తొలగించేవాడే గురుదేవుడు. ఎవరైతే నీలోపలఉన్న చీకటిని పోగొడుతున్నారో వారికి శరణాగతి చెయ్యండి. భారతీయ సంస్కృతిలో ఆచార్యుడికి చాలాప్రాముఖ్యత ఉంది. పూర్వం ఆచార్యుడు దగ్గరఉండి చదువుకొనేవారు. వాడి చదువుతోపాటు, దైనందినప్రవర్తనకూడా చూస్తూ వాడి చైతన్యస్థాయి పెంచటానికి ఆచార్యుడు కృషి చేసేవాడు. ప్రతీ గురువుకూడా కరుణామయుడే. వేదాలలో ఉన్న సారాన్ని, ఉపనిషత్‌లలో ఉన్న సారాన్ని తీసి వ్యాసుడు బ్రహ్మసూత్రాలు వ్రాసాడు. ఆయన వేదాలను విభజించాడు అందుచేత ఆయనను వేదవ్యాసుడు అంటారు. మానవ మనస్తత్వాలు ఎన్ని రకాలుగా ఉంటాయో అన్నిరకాల మనుషులగురించి భారతంలో ఆయన చర్చించాడు. భారతంలోలేనిది ఈ సృష్టిలో ఏదీలేదు అని వ్యాసుడు చెప్పాడు. భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు కాని ఉన్నాడని నిశ్చయం మనకులేదు. ఆనిశ్చయం కనుక ఉంటే భగవదనుభవం పొందాలనే జిజ్ఞాస మనకు కలుగుతుంది. ఎందుకు ఆనిశ్చయం మనకు లేదు అంటే దానికి మనలో ఉన్న స్వార్ధమే కారణం. మనిషి ఎక్కువగా స్వార్థంగా జీవిస్తున్నాడు. అందువలననే పారమార్థికస్థితిని అందుకోలేకపోతున్నాడు. మీకు రాగద్వేషములు రానియ్యండి, అసూయ రానియ్యండి, ఎన్ని కుతంత్రాలు కుయుక్తులు వచ్చినా అవిఅన్నీ స్వార్థంలోనుండి వస్తున్నాయి, ఇవి అన్నీ స్వార్థం కంటే భిన్నంగాలేవు. మనందరకు తిండియందు అపేక్ష ఎక్కువ, జ్ఞానంపట్ల అపేక్ష తక్కువ, మనం అన్నం తింటున్నాము అంటే ఆత్మజ్ఞానసముపార్జన చేయాలనేబుద్ధిమనకు ఉండాలి. ఆత్మజ్ఞానం ఒక్కటే నిజమైన విద్య. భగవంతుడు మనహృదయంలో ఉన్నాడు. భగవంతుడు ఎక్కడైతే ఉన్నాడో అక్కడ మనం వెతకటం మానివేసి, ఎక్కడయితే లేడో అక్కడ వెతుకుచున్నాము. అందుచేత భగవంతుడు ఎక్కడ ఉన్నాడో మనకు తెలియజేసి, వాడిని ఎలా అన్వేషించాలో మనకు బోధించేవాడే గురువు. గురువు అంటే వాడు మనకు భోధిస్తాడు కాని మనలను బాధించడు.

రమణ భాస్కర

మీలో ఉన్న అహంభావనను తొలగించటానికి ప్రయత్నం చేసేవాడు, తదనుగుణంగా మీకు సహాయసహకారములు అందించేవాడు గురువు. మీ తల్లితండ్రులు డబ్బు ఇస్తారు, బట్టలు పెడతారు కాని మీ అజ్ఞానాన్ని గురువేపోగొట్టాలి. గురుఋణం తీర్చుకోవటం చాలాకష్టం. నిజమైన గురువు మన లోపలే ఉన్నాడు. వాడు ప్రతీజన్మలోను మనలను చూస్తూ ఉంటాడు. ఒకోసారి ఏమి చేస్తాడు అంటే వీరి కోసం మరల శరీరం ధరించటం ఎందుకు అని లోపలనుండే మనలను కరెక్టు చేయటానికి చూస్తాడు, మనకు లోపల నుండి గైడెన్స్ ఇస్తూఉంటాడు. మీరు ఇంటిదగ్గర నిర్మలంగా, నిరాడంబరంగా కూర్చొంటే మీకు ఏది మంచిదో, ఏదిచెడో, మీరు ఎలా నడవాలో అన్నీ మీ హృదయం చెపుతూఉంటుంది. నీవు వ్యక్తిభావనలేకుండా, అహంభావన లేకుండా ఏదైనా మంచిపని చేస్తే దానివలన సమాజానికి మేలు జరుగుతుంది. కర్తృత్వం లేకుండా పనిచేస్తే అది లోకానికి అందం, నీ హృదయానికి ఆనందం అని వ్యాసమహర్షి చెపుతున్నారు. మనం బాహ్యమైన విషయాలకు, ఆడంబరాలకు అసలు ప్రాముఖ్యత ఇవ్వకూడదు. మన మాటలో, ఆలోచనలో ఆడంబరం ఉండకూడదు.

మనం ఏదో కోరికలు దృష్టిలోపెట్టుకొని నవగ్రహాల చుట్టూ తిరుగుతాము. అలా తిరగవద్దు అనికాదు తిరగండి కాని రాగద్వేషాలు అనే గ్రహాలనుండి విడుదలచేయమని తిరగండి. మీరు ఎప్పుడైనా శనీశ్వరుడికి పూజలుచేస్తే ఈరెండు గ్రహాలలోనుండి విడుదలచేయమని చేయండి. ఈ రాగద్వేషములే మానవుడికి పునర్జన్మహేతువులు. మనకు అధ్యయనం మీద శ్రద్ధలేదు, జ్ఞానమార్గం మీద శ్రద్ధలేదు, తెలుసుకోవాలనే కాంక్ష లేదు, భగవంతుడిని ఏదో ఒక వస్తువుగా చూడాలని తపనపడుతున్నాము. భగవంతుడు మన స్వరూపంగా ఉన్నాడు, మన ప్రాణానికి ప్రాణంగా, మనస్సుకు మనస్సుగా ఉన్నాడు అనే విషయం మర్చిపోయాము. ఇది మర్చిపోయి జ్ఞానమార్గానికి దూరమయిపోయి, శాంతికి దూరమయిపోయి ఇంక యజ్ఞాలు, నోములు, పూజలు అని వాటిచుట్టూ తిరుగుతున్నాము. పూజచెయ్యవచ్చు కాని దాని పరమార్థం ఏమిటో మనకు తెలియాలి. యజ్ఞం అంటే ఏమిటి స్వార్థం లేకుండా మనం ఏపనిచేసినా అది యజ్ఞంతో సమానము. స్వార్థంలేకుండా పనిచేస్తే సమాజం ఎంతోకొంత ఉద్ధరింపబడుతుంది, అదేకాలంలో నీ చైతన్యస్థాయి పెరుగుతుంది, నీ హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. మనం ఏదైనా ఆలోచించేటప్పుడు కులమతాలు, రాగద్వేషాలు అడ్డురాకూడదు, అవి అడ్డువస్తే మన ఆలోచనా విధానం గాడితప్పుతుంది. రాగద్వేషాలు పెంచుకోవటం వలన మనలోపల అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిపట్ల మనకు గౌరవం తగ్గిపోతుంది, భక్తి, జిజ్ఞాస తగ్గిపోతుంది. ఈశ్వరుడిపట్ల



మనకుఉన్న కృతజ్ఞతను తెలియజేయటానికి పూజ చెయ్యాలి. గురువు మన హృదయంలోనే అంతర్యామిగా ఉన్నాడు, మన బుద్ధిలోని దోషాలను సరిచేయటానికి చూస్తున్నాడు. దక్షిణామూర్తి మౌనంగా బోధించాడు. మౌనంకూడా బోధిస్తుంది. కాని వివేకవంతులకు, చైతన్యస్థాయి ఎక్కువ ఉన్నవారికి మాత్రమే ఆమౌనబోధ అందుతుంది. గురువు యొక్క చూపు, మాట, నడక, ప్రతికదలిక కూడా అనుగ్రహం, గురువు యొక్క స్వరూపమే అనుగ్రహం. భగవదనుభవం నీకు కలిగేవరకూ ప్రతీ జన్మలోనూ నిన్ను వెంటాడుతూ ఉంటాడు, ఏక్షణానికి ఆక్షణం నిన్ను గైడ్‌చేస్తూ ఉంటాడు. గురువు కంటే ఎక్కువ ప్రేమించేవారు ఎవరూ ఉండరు. గురువుకు గ్రహించటానికి ఈలోకంలో విషయాలు అంటూలేవు. గురువు ఉంటాడు అంతే, ఆయనకు తలంపులు ఉండవు. ఒకవేళ ఏదైనా తలంపు తెచ్చుకొంటే మీక్షేమంకోరి మీకు ఏదైనా చెప్పటానికి పనికివచ్చేదే కాని వారికివచ్చిన తలంపు వారిని బాధించదు. మనతలంపు మనలను బాధిస్తుంది. మీకు దు:ఖం వస్తూఉంటే అక్కడ నేను అనే తలంపు ఉండాలి లేకపోతే నాది అనే తలంపు ఉండాలి. నేను, నాది. అనే తలంపులు లేకుండా ఏమానవుడి దుఃఖంరాదు. ఈరెండు సంకెళ్ళలో నుండి ఎవడైతే విడుదల పొందాడో వాడు సుఖపడతాడు. మనం ఎప్పుడైనా ఈశ్వరుడిని స్మరించుకొంటూ ఉంటాము. మన తెలివితేటల వలన ఆయనను స్మరించుకోవటం లేదు ఆయన మనలను స్మరించుకొన్నప్పుడు మనకు ఆయన జ్ఞాపకం వస్తూఉంటాడు. గురువుదయ ఉన్నప్పుడే గురువును తలపెట్టుకొంటాము కాని మనం ఏమనుకొంటాము అంటే మన తెలివి అనుకొంటాము. మనం ఎంత, మన తెలివి ఎంత. మీరు ఇంటిదగ్గర ఒంటరిగా కూర్చొని అందరూ సుఖంగా, శాంతిగా ఉండాలి, అందరూ బాగుండాలి అని అనుకోండి దానికి కూడా భగవంతుడు కొన్ని మార్కులు వేస్తాడు, ఆధ్యాత్మికంగా ఉన్నతస్థితిని ఇస్తాడు. మనకు ఎప్పుడైనా కోరికలు వస్తాయి, కోపం వస్తుంది ఇవన్నీ ఉద్రేకాలు, మనం ఉద్రేకపడటం నేర్చుకొన్నాము కాని ఆలోచించటం నేర్చుకోలేదు. మీకు ఇంటిదగ్గర సమస్యలు ఉండవచ్చు, సమాజపరంగా సమస్యలు ఉండవచ్చు కాని మీ ఆలోచనావిధానం మాత్రం విడిచిపెట్టకూడదు. రైలు చక్రం ఏవిధంగా అయితే దాని ట్రాక్‌ను విడిచిపెట్టదో అలా మన ఆలోచనావిధానం భగవదనుభవం పొందాలనే ట్రాక్‌ను విడిచిపెట్టకూడదు అది గుర్తుపెట్టుకోండి. గురువు ద్వారా వచ్చే మంచి మీకు తెలియాలికాని ఆయన కనబడనక్కరలేదు. మీకు మేలు జరిగిపోతూ ఉండాలి, మీకు రావలసిన శాంతి, జ్ఞానం వస్తూ ఉండాలి కాని నాన్నగారు మీకు కనబడకూడదు, నాన్నగారు చేస్తున్నారు అనే తలంపు కూడా మీకు రాకుండా ఆపని జరిగిపోతూ ఉండాలి అప్పుడు నాన్నగారు నిజమైన

నాన్నగారు. నేను మీకు కనబడకూడదు కాని మీరు పొందేది ఏదో మీరు పొందుతూ ఉండాలి.

నారదుడు ధ్యానం చేసి, ప్రాణాయామం చేసి కోరికను, కోపాన్ని జయించాడు. ఈశ్వరుని కటాక్షం వలన వాటిని జయించాను అని నారదుడు అనుకోవటం లేదు. నేను సాధనచేసి నా తెలివితేటల వలన వాటిని జయించాను అనుకొంటూ గర్వం తెచ్చుకొంటున్నాడు, ఇదే మాయ. సమాజం ఆయనకు పాదపూజలు చేస్తున్నారు, ఆయనకు గర్వం పెరుగుతోంది. నారదుడికి గర్వం వచ్చిందని పాదపూజ చేసేవారికి తెలియటం లేదు కాని లోపలఉన్న ఈశ్వరుడు అనుకొంటున్నాడు వీడికి గర్వం వచ్చింది, పాడైపోతున్నాడు అనుకొంటున్నాడు. గర్వం వస్తోంది దానిని తగ్గించుకో అని లోపలనుండి గైడెన్స్ ఇస్తున్నాడు కాని ఆయనకు అర్థంకావటంలేదు. అది నారదుడికి తెలియజేయటం కోసం లోపలగురువు ఆలోచించిఆయనకు పెళ్ళిచేయాలనుకొన్నాడు. కాని నారదుడికి కూడా నేను పెళ్ళి చేసుకోవాలనే కోరిక రావాలి కదా. నారదుడు ఒక మహారాజు ఇంటికి వెళ్ళాడు. లోపలగురువు ఏమిచేసాడు అంటే మహారాజుగారి అమ్మాయిని నారదుడి దగ్గరకు వచ్చేలా చేసాడు. ఆ అమ్మాయి చాలా అందంగా ఉంది. నారదుడు ఆ అమ్మాయిని చూసిన వెంటనే ఇంత అందం నేను ఎక్కడా చూడలేదు అనుకొన్నాడు, ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలనుకొన్నాడు. రాజుగారి దగ్గరకు వెళ్ళి ఇంత అందమైన అమ్మాయిని నేను ఎప్పుడూ చూడలేదు, స్వర్గం వచ్చి భూమిమీద నడుస్తున్నట్లుగా ఉంది, అందం ఈ రూపం ధరించినట్లుగా ఉంది, మీ అమ్మాయిని నేను పెళ్ళిచేసుకొంటాను అని రాజుగారితో చెప్పాడు. లోపలగురువు అంటే మొద్దబ్బాయి అనుకోవద్దు, ఎప్పుడు ఎక్కడ ఎలా ఆడించాలో అలా ఆడిస్తూ ఉంటాడు. రాజుగారు ఏమంటున్నారు అంటే మీ బోటి మహర్షులు మా అమ్మాయిని పెళ్ళిచేసుకొంటాను అంటే నాకు చాలాసంతోషం అంటున్నారు. అమ్మాయి హృదయంలో కూడా గురువు ఉన్నాడు కదా అక్కడ అమ్మాయితో ఏమి చెపుతున్నాడు అంటే పెళ్ళి గురించి అడుగుతారు చేసుకొంటాను అని చెప్ప అంటున్నాడు. పెళ్ళికూతురు కూడా పెళ్ళి చేసుకొంటాను అని చెప్పింది. ముహూర్తం పెట్టారు, అందరూ పెళ్ళికి వచ్చారు. ఇద్దరిని పెళ్ళిపీటలమీద కూర్చోపెట్టారు. మధ్య తెరకట్టారు. వీడి గర్వం ఎలా అణచాలా అని లోపలగురువు చూస్తున్నాడు. పంతులుగారు అమ్మాయితో కాబోయే భర్తను చూడు అన్నారు. పెళ్ళి కూతురు చూసి ఒక్కసారి వెర్రికేక వేసింది కోతి, కోతి అని, ఈ కోతిగాడికి ఇచ్చి పెళ్ళి చేస్తున్నారు ఏమిటి అంది. అంటే లోపలగురువు నారదుడి మొఖాన్ని కోతిలాగ



కనబడేలాచేసాడు. రాజుగారిని అడుగుతారు మీ అమ్మాయి కోతి అంటోంది ఏమిటి అని. కోతి కాదు ఆయన నారదమహర్షి అని రాజుగారు అంటారు. రాజుగారు ఇలా చెపుతున్నారు ఏమిటి అని అప్పడు పురోహితులు చూస్తారు. ఆయనకు కూడా పెళ్ళికొడుకు కోతిలాగానే కనిపిస్తాడు. అందరూ కోతి కోతి అంటున్నారు ఏమిటి అని రాజు గారు చూస్తారు. ఆయన కూడా కోతి, కోతి అంటాడు. పెళ్ళికివచ్చిన వారు అంతాకూడా చూసి కోతి, కోతి అంటారు. ఇదేమిటి నేను మహర్షిని ఏదో పెళ్ళికూతురు తెలియక కోతి అనవచ్చు కాని మా తరపువారు కూడా కోతి అంటున్నారు ఏమిటి అని నారదుడు చిన్నబుచ్చుకొన్నాడు. తోడపెళ్ళికొడుకును పిలిచి అద్దం తెమ్మని అద్దంలో బాగా చూసుకొన్నాడు. అద్దంలో ఆయన కోతిలాగే కనిపిస్తున్నాడు. నేను కోతిని, నేను కోతిని ఇంక నాకు పెళ్ళి ఎందుకు అని పీటలమీద నుండి లేచిపోయాడు. అప్పడు గురువు దేహం ధరించి వచ్చి నారదుడితో పెళ్ళి అయిపోయిందా అన్నాడు. నారదుడు మంచివాడే కాని ప్రమాదంలో పడ్డాడు, ఆయనకు తెలియజేయటం కోసం ఇదంతా చేసి, అందరిచేత కోతి అనిపించినవాడు గురువే. నీకు పెళ్ళి కావలసివచ్చిందా, ఇదంతా నేనే చేసాను. నువ్వు కోతివికాదు, నారదమహర్షివే. నేను కోరికను జయించాను అన్నావు మరి ఈ అమ్మాయిని ఎందుకు పెళ్ళి చేసుకొంటున్నావు. ఈశ్వరుని అనుగ్రహం వలననే నేను కామక్రోధములనుండి విడుదల పొందాను అన్న సంగతి మర్చిపోయి, నా తెలివితేటల వలన జయించాను అంటున్నావు. ఎవరి దయవలన నీవు ఈ స్థితిని పొందావో ఆయనపట్ల కృతజ్ఞత చూపించటం లేదు, ఈశ్వరుడిని మర్చిపోయావు. మాయ ఈశ్వరుడి చేతిలో ఉంది, ఆయన దారి ఇస్తేనే నీవు ఇంతటివాడివి అయ్యావు. ఈశ్వరుడి పట్ల కృతజ్ఞత వదిలివేశావు, అది తెలియజేయటం కోసం ఇలా చేసాను, నీ క్షేమం కోరి దీనిని క్రియేట్ చేసాను. తాత్కాలికంగా నీకు బాధరావచ్చును, అందరిచేత నువ్వు అవమానం పడి ఉండవచ్చు కాని నిన్ను రక్షించటం గురువు యొక్క ధర్మం. నువ్వు భవిష్యత్‌లో పాడైపోకుండా ఉండటం కోసం, ఈ పాయింట్‌లో నిన్ను సేవ్ చేయాలనుకొన్నాను. అందుచేత నీకోసం రూపం ధరించి వచ్చాను అని గురువు చెప్పాడు. నువ్వు నారదమహర్షివే కాని గర్వం వలన ఇటువంటి పరిస్థితి తెచ్చుకొన్నావు. గర్వం కూడా పనికిరాదు అని చెప్పటం కోసం నారదుడిని అడ్డుపెట్టుకొని గురువు మనకు చేస్తున్న హితబోధ. ఇంద్రియగతమైన జీవితం, మనోగతమైన జీవితం నిజము అని మనం అనుకొంటున్నాము. ఎందుచేతనంటే మనకు తగినంత వైరాగ్యం లేదు, వివేకం లేదు, సాధనాబలం లేదు, సత్పురుషుల సహవాసం లేదు. భగవంతుడు మనలను ఏ విధంగా అయితే జీవించమని చెప్పాడో ఆవిధంగా జీవిస్తే మనకు ఆత్మజ్ఞానం

ఇస్తాడు. నిరంతరం నన్ను స్మరించగా స్మరించగా, ఆరాధించగా ఆరాధించగా నన్ను తెలుసుకొనే బుద్ధిని నేను నీకు ప్రసాదిస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు. మీ పని మీరు శ్రద్ధగా చేసుకొంటూ సమాజానికి కొంత ఉపయోగపడాలి. భగవంతుడు మీకు ఏ అవకాశములు ఇచ్చాడో వాటిని ధనం అయినా, చదువు అయినా సమాజంలో పదిమందికి ఉపయోగపడేలా చేయటం వలన సమాజం బాగుపడుతుంది, మీ బుద్ధికి వికాశం కలుగుతుంది, మీరు తేజోవంతులు అవుతారు, ఆత్మజ్ఞానానికి వారసులవుతారు. ఆత్మజ్ఞానం యొక్క వైభవం గురించి మనం శ్రవణం చేయాలి. మీ మనస్సుకు లోచూపు కలగటానికి సహాయసహకారములు అందించేవాడే గురువు. గురువు అంటే జ్ఞానదాత, మీ అహంకారానికి కోత. ఇతరుల బాధ మన బాధ అని మనం అనుకోవటం లేదు కాని మన బాధను ఇతరులు పంచుకొంటే బాగుండును అనుకొంటున్నాము, ఇంక మనకు ఆత్మజ్ఞానం ఎలా కలుతుంది. మనకు సబ్జక్టు ప్రధానం, ఆలోచన ప్రధానం. సత్యవస్తువు మన హృదయంలో ఎంతలోతులలో ఉందో అంతలోతులలోనికి వెళ్ళటానికి మనకు పూజ, జపం, ధ్యానం, విచారణ ఉండాలి, శాస్త్రంయొక్క సహాయం ఉండాలి, సత్పురుషుల యొక్క సాంగత్యం ఉండాలి. పెద్దలకు సేవ చేయాలి, గురుకృప ఉండాలి. భగవాన్ ఏమిచెపుతున్నారు అంటే నీవు ఇతరులకు చేసిన సహాయం అంతా భగవంతుడు తిరిగి నీకే ఇచ్చేస్తాడు. ఇతరులకు చేసిన సహాయం తిరిగి మీకే వస్తుందని తెలిస్తే ఇతరులకు సహాయం చేయకుండా ఎలా ఉండగలరు. మనం ధనం కావాలంటే ధనవంతుడిని, పాండిత్యం కావాలంటే పండితుడిని ఎలా ఆశ్రయిస్తామో అలాగ మనకు జ్ఞానం కావాలంటే ఆత్మజ్ఞానిని ఆశ్రయించాలి. భగవాన్ జీవితంలో చివరరోజులలో శరీరానికి కేన్సర్ వచ్చి శరీరం బాగా శుష్కించి పోయింది. అక్కడున్న అధికారులు దర్శనం కూడా ఆపేస్తాము అన్నారు. అప్పుడు భగవాన్ ఏమి చెప్పారు అంటే మీరు దీనికి బత్తాయిరసం ఇస్తున్నారు, మజ్జిగ అన్నం పెడుతున్నారు. దర్శనానికి కూడా పనికిరాని దీనికి రసం ఎందుకు? మజ్జిగ అన్నం ఎందుకు? అన్నారు. నీకు తెలుసున్నా తెలియకపోయినా నీలోపల సత్యవస్తువు ఉంది. అది నీకు తెలిస్తే సుఖపడతావు, తెలియకపోతే ఆజన్మకుఆజన్మ దుఃఖం వెంటాడుతుంది. నీవు ఏమి చేయాలంటే నీ దేహాన్ని, నీ మనస్సును, భగవంతుడు నీకు ఇచ్చిన అవకాశములను లోపలఉన్న సత్యాన్ని తెలుసుకోవటానికి ఉపయోగించుకో. అలా ఉపయోగించకుండా ప్రకృతి విషయాలకు ఉపయోగిస్తావు అనుకో, సత్యానుభవం పొందకుండా లోకంలో నీవు ఏది సాధించినా అది ఒకటి లేని సున్నలతో సమానము. మీ దేహం యొక్క ప్రారబ్దాన్ని బట్టి మీకు సంపదలు రావచ్చు, పదవులు రావచ్చు కాని మీ మొఖంలోనికి అవినయం రానివ్వవద్దు, వినయాన్ని కాపాడుకోండి. సంపదలు, పదవులు ఇవన్నీ మెరుపులు, ఇవి నిజంకాదు. అవినయం రాకుండా చూసుకొంటే మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది అని ఆచార్యులవారు చెప్పారు. ఈ ప్రవచనాల వలన భక్తులకు ఏమి మేలు జరుగుతుంది అంటే మీరు ఆత్మానందం వరకు వెళ్ళవద్దు, ముందు ముఖ్యంగా మానసికఆరోగ్యం కలుగుతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 20 టు 27-7-03 | | వైజాగ్ కేంపు |
| 30-07-03 | బుధవారం | ముక్కామల, పెరవలి మండలం |
| 17-08-03 | ఆదివారం | విజయవాడ, ముత్యాలంపాడు, రామలింగేశ్వర ఆలయంలో, గవర్నమెంట్ ప్రెస్ దగ్గర |
| 19-08-03 | మంగళవారం | జగ్గయ్యపేట, కృష్ణా జిల్లా |

## జిన్నూరు శ్రీ రమణ క్షేత్రంలో గురుపూజ మహోత్సవములు



సద్గురు శ్రీ నాన్న గారికి గురుపూజ చేస్తున్న పిట్లవాని పాలెం వాస్తవ్యులు "మా టీవి" డైరెక్టర్ శ్రీ పి. వెంకటేశ్వరరాజు దంపతులు





సద్గురు శ్రీ నాన్న గారికి గురుపూజ చేస్తున్న, విజయవాడ వాస్తవ్యులు శ్రీ పి. రామకృష్ణంరాజు దంపతులు



MAA TV

**గమనిక**: ది॥ 26-7-2003 మరియు ది॥ 2-8-2003 శనివారములు ఉదయం గం॥ 8-30 నుండి గం॥ 9-00ల మధ్య సద్గురు శ్రీ నాన్నగారు, జిన్నూరు గురుపౌర్ణిమ కార్యక్రమము ప్రముఖ టి.వి.ఛానల్ "మా టి.వి." ద్వారా ప్రసారమగును. కావున భక్తులందరూ ఈ కార్యక్రమము తిలకించవలసిందిగా కోరుచున్నాము.



డా॥ ఆర్. సాయి ఈశ్వర వర్మ, B.D.S గారి ఈశ్వర సాయి సూపర్ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్ పాలకొల్లులో ప్రారంభిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు



పాలకొల్లులో అన్నదాన సమాజం భవనంలో శ్రీ బాలాజీ ఏజన్సీస్ వారు రిలయన్స్ వారు తయారు చేసిన రెక్రాన్ 3డిఎస్ ఫైబర్ ప్రారంభోత్సవ సమయంలో ప్రసంగిస్తున్న సద్గురు శ్రీ నాన్న గారు ప్రక్కన ఆసీనులైన పశ్చిమగోదావరి జిల్లా డిస్ట్రిబ్యూటర్ శ్రీ వర్దినీడి సత్యనారాయణ (బాబ్జీ), రిలయన్స్ రమేష్, రిలయన్స్ రవికిరణ్